

For full details click here

ఇక స్నానం చేయాల్సిన పని లేదు,,,మనుషుల కోసం వాషింగ్ మెషీన్ వచ్చేసింది

టెక్నాలజీ పెరిగిపోతున్న కొద్దీ మనుషుల్లో బద్ధకం పెరిగిపోతోంది. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ముందు గంటల తరబడి కూర్చొని బాన పొట్టలు పెంచుతున్నారు. వాటిని కరిగించేందుకు మళ్లీ జిమ్‌లకు వెళ్తున్నారు. ఇక ఇంట్లో అయితే మొత్తం ఎలక్ట్రిక్ వస్తువులే దర్శనం ఇస్తున్నాయి. కూరగాయలు కోయడం దగ్గరి నుంచి మొదలుపెడితే జుట్టు దువ్వుకోవడం వరకు అన్నీ మెషీన్లే పని చేస్తున్నాయి. టెక్నాలజీ రోజురోజుకూ అప్‌గ్రేడ్ అవుతుంటే.. వాటిని ఉపయోగిస్తున్న మనం మాత్రం దినదినం సోమరిపోతుల్లాగా మారిపోతున్నాం. ఇక ఇలాంటి వాటిని ఆసరాగా చేసుకుని.. మార్కెట్లోకి రకరకాల వస్తువులు వచ్చిపడుతున్నాయి. పళ్లు తోముకోవడానికి కష్టంగా ఉందని ఎలక్ట్రిక్ బ్రష్‌ల దగ్గరి నుంచి.. మలవిసర్జన చేసిన తర్వాత చేతితో కడుక్కోకుండా సెన్సార్లతో కొత్త రకం టాయిలెట్ల వరకు అన్నీ ఆటోమేటిక్‌గా పనులు చేస్తున్నాయి. ఇక మన మెదడు కూడా ఆలోచించకుండా.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ వచ్చేసింది. మన కంట్రోల్ లేకుండానే మన పని జరిగిపోతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా హ్యూమన్ వాషింగ్ మెషీన్ కూడా రావడంతో.. మనం స్నానం చేయాల్సిన అవసరం లేకుండానే.. అదే మనల్ని అందులో వేసి బట్టలు ఉతికినట్లు ఉతికేస్తుంది.

ప్రపంచంలోనే టెక్నాలజీ అనగానే ఠక్కున గుర్తొచ్చే పేరు జపాన్. రకరకాల మెషీన్లు, ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయడంలో జపాన్ శాస్త్రవేత్తలు ముందు వరుసలో ఉంటారు అంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ క్రమంలోనే రోజూ పొద్దున్నే లేచి స్నానం చేయడానికి బద్ధకించేవారికోసం జపాన్‌లోని ఓ కంపెనీ హ్యూమన్ వాషింగ్ మెషీన్లను తయారు చేసింది. ఇక ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ ఉపయోగించి.. మనం కష్టపడకుండానే **15** నిమిషాల్లో స్నానం చేసేయొచ్చని తెలిపింది. తాజాగా జపాన్‌లోని సైన్స్ కో అనే కంపెనీ ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఎక్స్‌పోలో ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ఉంచిన సైన్స్ కో కంపెనీ.. దాన్ని ట్రై చేసేందుకు అవకాశం కల్పించింది.

ఒసాకాలోని కన్సాయి ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ ఇప్పుడు ప్రపంచం దృష్టిని

ఆకర్షింస్తోంది. అయితే ఈ ఎక్స్‌పోను చూసేందుకు వచ్చిన వెయ్యి మంది.. ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ఉపయోగించి.. స్నానం చేసేలా సైన్స్ కో కంపెనీ ఏర్పాట్లు చేసింది. ఇక ఈ ఎక్స్‌పో ముగిసిన తర్వాత.. దాన్ని ఉపయోగించి స్నానం చేసిన వారు చెప్పిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా భారీ సంఖ్యలో ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్లను తయారు చేయనున్నట్లు సైన్స్ కో కంపెనీ ప్రకటించింది.

ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ చూడటానికి ఫైటర్‌జెట్ కాక్‌పిట్ ఆకారంలో ఉంటుంది. బయటినుంచి చూస్తే లోపల ఉన్న వ్యక్తులు కనిపించేలా ప్లాస్టిక్‌తో తయారు చేశారు. ఇక అందులోకి ఒక వ్యక్తి వెళ్లి దాన్ని ఆన్ చేసిన తర్వాత.. సగానికిపైగా వేడినీరును నింపుకుంటుంది. ఆ తర్వాత అందులో ఏర్పాటు చేసిన హైస్పీడ్ జెట్స్ నుంచి నీరు షవర్ల మాదిరిగా చిమ్ముతూ ఉంటుంది. ఇక ఆ నీటిలో **3** మైక్రోమీటర్ల సైజులో ఉండే చిన్న చిన్న నీటి బుడగలు ఏర్పడుతాయి. ఈ నీటి బుడగలు.. మనిషి శరీరంపై ఉండే మురికిని సులువుగా తొలగించేందుకు ఉపయోగపడతాయి.

ఇక ఈ వాషింగ్ మెషీన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో పనిచేస్తూ ఉంటుంది. ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్లు.. మనిషి శరీరానికి సంబంధించిన సమాచారం మొత్తం సేకరించి.. అందులో ఉన్న వ్యక్తిని మూడ్ ఎలా ఉందో తెలుసుకుని.. వారిని ఉత్సాహంగా ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక ఏఐ ద్వారా.. ఆ వ్యక్తి ఉత్సాహంగా ఉన్నాడా లేక నీరసంగా ఉన్నాడా అనేది అంచనా వేసి.. అందుకు అనుగుణంగా ఉండే వీడియోను ఆ వాషింగ్ మెషీన్‌లో ప్లే చేస్తుంది. అయితే ఎంతో టెక్నాలజీని ఉపయోగించి.. భవిష్యత్ కోసం ఇది తయారు చేశారు అనుకుంటే పొరపాటే. ఎందుకంటే దీన్ని **50** ఏళ్ల క్రితం చేసిన డిజైన్ ఆధారంగా తయారు చేశారు. **1970**లో జపాన్ వరల్డ్ ఎక్స్‌పోలో అప్పటి శానియో ఎలక్ట్రిక్ కో ప్రస్తుతం పానసోనిక్ కంపెనీ తొలిసారి తయారుచేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే అదే డిజైన్ ఆధారంగా.. కొత్త వెర్షన్‌తో ఈ లేటెస్ట్ హ్యూమన్ వాషింగ్ మెషీన్లను తయారు చేసినట్లు సైన్స్ కో కంపెనీ వెల్లడించింది.

